www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 10 అక్టోబర్ 2025



శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులు బాల్యదశ నుంచి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మ్యాజిక్ కార్యదర్శి బాలబయ్యన్న, ప్రతినిధి వెంకటేష్ అన్నారు. గురువారం యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ 4,7 ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలంలోని ఇనుకపల్లి, మిట్టమీద పల్లెలో ప్రత్యేక శిబిరాలు గురువారం రెండవ రోజు కొనసాగాయి. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.లలిత, డాక్టర్ సునీత ఆధ్వర్యంలో శిబిరంలో క్విజ్ వ్యాస రచన గ్రామీణులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మ్యాజిక్ కార్యదర్శి బాలబయ్యన్న, ప్రతి నిధి వెంకటేష్ ప్రదర్శించిన ఇంద్రజాలం ఆకట్టుంది. మూఢనమ్మకాల వల్ల జరిగే నష్టాన్ని వివరించారు. వారం రోజులపాటు గ్రామంలో చైతన్య, సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రోగ్రాం ఆఫీసర్లు తెలిపారు.

బోధనేతర పనులను బహిష్కరిస్తున్నాం

- ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఇలియాస్ బాషా

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో అవలంభిస్తున్న ప్రయోగాలను, తిరోగమన విధానాలను వ్యతిరేకిస్తూ పాఠశాలల్లో ఈనెల 10 నుంచి కేవలం విద్యార్థుల హాజరు ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పాఠ్యాంశాల బోధన తప్ప మరే ఇతర కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహించబోమని, అటువంటి బోధనేతర కార్యక్రమాలను అన్నీ బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఇలియాస్‌బాషా, సెక్రటరీ జనరల్ రాఘవులు అబ్బుల్లా తెలిపారు. గురువారం రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు కడప జిల్లా పరిషత్ సిఇఒ విజయ్‌కుమార్‌కు, విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ సి.వి.రామకృష్ణకు ఫ్యాప్టో నేతలు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జూన్ నుంచి యోగాంధ్ర పేరుతోనూ, మెగా పేరెంట్ టీచర్ మీటింగ్, జిఎస్‌టి 2.0 పేరుతోనే మొక్కల పెంపకం, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేయడం, విద్యా కానుకలు విద్యార్థులకు అందజేయడం, వాటి వివరాలను కూడా ఆన్‌లైన్ చేయాల్సి రావడం బాధాకరమని పేర్కొన్నారు. రోజుకు ఒక నివేదికను ఎంఇఒ కార్యాలయానికి పంపాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. విద్యార్థుల అసెస్మెంట్ ప్రక్రియ ఆన్‌లైన్ చేయాల్సిన రావడం వలన ఉపాధ్యాయులకు బోధనకు ఆటంకంగా నిలుస్తున్న పరిస్థితుల్లో మరల అసెస్మెంట్, పుస్తకాలు, టీచర్ హ్యాండ్ బుక్, ఉపాధ్యాయులకు పరిధికి మించిన పరిస్థితిల్లో ఉపాధ్యాయులను బోధనకు దూరంగా వివిధ వేయడాన్ని నిరసిస్తూ బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రవీణ్ కిరణ్, జిల్లా నాయకులు మాదన విజయకుమార్, శౌకత్ బాష, శ్యామలాదేవి, సుబ్బారెడ్డి, జ్యోతి రామచంద్రబాబు, జబీర్ అహ్మద్, సాజిత పాల్గొన్నారు. **చాపాడు :** మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వల్ల టీచర్ల బోధనా సమయం వృథా అవుతోందని, బోధనా సమయాన్ని విద్యార్థులు నష్టపోతున్నందున రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు శుక్రవారం బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నామని నాయకులు ఎంఇఒలు వి.రవిశంకర్, వి.వంశీక్రిష్ణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు ఎ.శ్యామసుందర్‌రెడ్డి, కొత్తపల్లి శ్రీనివాసులు, మండల నాయకులు రాజారెడ్డి, మల్లికార్జున, సుబ్బరాయుడు, భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, క్రిష్ణయ్య, వెంకటరెడ్డి, ప్రభాకరరెడ్డి, నందగోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. **వేంపల్లె :** బోధనేతర కార్యక్రమాలను ఇక నుంచి చేపట్టబోమని, విద్యా బోధన మాత్రమే చేస్తామని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి తెలిపారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు గురువారం స్థానిక ఎంఇఒ-2 స్థానిక ... ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ధర్మారెడ్డి, సుకన్య, చంద్రశేఖర్, రాజశేఖర్, సులోచన, రాయుడు, నరసింహారెడ్డి, గోవర్ధన్, మహబూబ్ బాషా, రియాజ్, ఆదినారాయణ పాల్గొన్నారు. **కలసపాడు :** ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్న బోధనేతర కార్యక్రమాలన్నింటినీ బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు పి రమణారెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ, విద్యారంగ, ఆర్థికపరమైన సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ, ఫ్యాప్టో చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా గురువారం సాయంత్రం మండల ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఎంఇఒలు పిఎం ప్రేమసాగర్, ఎస్. మస్తాన్‌వలికి బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు మెమోరాండంను అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు శేఖర్ బాబు, బాల జోజి, సత్యనారాయణ, వెంకటరెడ్డి, కిరణ్ కుమార్, బాల ఓబయ్య, ప్రసాదరెడ్డి శివారెడ్డి ,కమాల్, శ్రీనివాసులు, రమాదేవి, గుల్జారబేగం పాల్గొన్నారు.



కలసపాడు : నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, ఫ్యాప్టో నాయకులు

లక్ష్యాన్ని పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి జిఎస్ డబ్ల్యుఎస్ డబ్ల్యుఎస్ సేవలు, వైద్య ఆరోగ్య సదుపాయాలు, పౌరసరఫరాల, రైతు సేవా కేంద్రాల్లో సేవలు, పిఎంఎజివై, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ పరిహారం, ఎస్‌సి కార్పొరేషన్ కొనుగోలు చేసిన వాహనాల పంపిణీ తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తోపాటు శ్రీధర్ చెరుకూరి తోపాటు జెసి అదితి సింగ్ హాజరయ్యారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యు మెంట్ అప్‌లోడ్, 3 అంచెల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు, డ్రగ్స్ పంపిణీ, ఆసు పత్రులలో పారిశుధ్యం, ఆసుపత్రులలో రోగ నిర్ధారణ సేవలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సిపిఒ హాజరతయ్యా, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్ కుమార్, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మద్యం ఏరులై పారుతోంది

ప్రజాశక్తి - కడప : రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, కుటీర పరిశ్రమ పేరుతో నకిలీ మద్యం టిడిపి కూటమి ప్రభుత్వం తయారు చేస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా విమర్శించారు. గురువారం తన నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 54 వేల బెల్ట్ షాప్‌లను రద్దు చేశామన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. నాడు ఎన్టీఆర్ సంపూర్ణ మద్యపానం అమలు చేస్తే చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం తిరిగి మద్యం విక్రయాలను ప్రారంభించిందని పేర్కొన్నారు. చంద్రబాబు విషనరీ నాయకుడంటే బహుశా ఇదేనేమో అని ఎద్దేవ చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు మహమ్మద్ షఫీ,బసవరాజు, కె.బాబు, చాక్లెట్ గౌస్, అజ్మతుల్లా, జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి మునిశేఖర్ రెడ్డి, నగర కార్యదర్శి మాస్టర్ అహ్మద్, నాయకులు కృష్ణ, వెంకటరావు, ఫజల్ పాల్గొన్నారు.

మెడికల్, లైఫ్ ఇన్సూరెన్స్‌పై జిఎస్‌టి లేదు : డిఎంహెచ్‌ఒ



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఎస్‌టి 2.0 స్కీంలో భాగంగా మెడికల్, లైఫ్ ఇన్సూరెన్స్‌పై జిఎస్‌టిని రద్దు చేసిందని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె.నాగరాజు పేర్కొన్నారు. గురువారం వేదాంత హాస్పిటల్స్‌లో జిఎస్‌టిపై ఆసుపత్రి సిబ్బంది, పేషంట్ల సహాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందుతుందని తెలిపారు. ప్రజలలో కొనుగోలు శక్తి పెంచడానికి, ఉత్పాదక రంగాలలో అభివృద్ధిని సాధించడానికి కేంద్ర ప్రభుత్వం 2.0 స్కీం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా సామాన్య మానవుడు తనకు కావలసిన వస్తువులను కొనుగోలు చేసే శక్తి పెరిగిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ బాల ఆంజనేయులు మాట్లాడుతూ వైద్య అవస రాలకు సంబంధించిన వస్తువులపై జిఎస్‌టి తగ్గించారని తెలిపారు. కార్యక్ర మంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ క్రాంతి కుమార్, ప్రముఖ గుండె శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఎస్. శ్రావణ్ కుమార్ రెడ్డి, ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ ఎన్. దినేష్ కుమార్ రెడ్డి, హాస్పిటల్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ పి.శివశంకర్ రెడ్డి, సిబ్బంది, పేషెంట్స్ సహాయకులు పాల్గొన్నారు. **కలసపాడు :** జిఎస్‌టి 2.0 సంస్కరణలు తీసుకురావటం చాలా శుభ పరిణామమని కలస పాడు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సాయితేజ తెలిపారు. గురువారం మండలంలోని అన్ని విలేజ్ క్లినిక్‌లలో ఎంఎల్‌పిహెచ్‌పి, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యాధికారి మాట్లాడుతూ దేశంలో నేరుగా ఎక్కువ లాభం చేకూర్చే పెద్ద మార్పు అని, ముఖ్యంగా మందుల రేటు తగ్గించడం, ఆరోగ్య సేవలపై పన్నులు తగ్గించడం ప్రతి కుటుంబం ఆరోగ్య బీమా సౌకర్యం పొందేలా చేయడం కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి వెంకట సుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఎంఎల్ హెచ్ పిలు నవీన్, శ్రీను, వైద్య సిబ్బంది, ఎఎన్ఎం లక్ష్మీ దేవి, జసింత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ కుట్రలు చేయడం సిగ్గుచేటు

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్రంలో 10 వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో నిర్మించి నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వైసిపి అనవసరంగా రాద్ధాంతం చేస్తుందని టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుమలేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాక్షాత్తు హైకోర్టే పిపిపి విధానాన్ని సమర్థించిందన్నారు. జగన్ హయాంలో రాష్ట్రాన్ని దివాలా తీయించకపోతే ఇప్పుడు కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను పిపిపి విధానంలో నిర్మించాల్సిన అవసరమే ఉండేది కాదు కదా అని పేర్కొన్నారు.

జిజిహెచ్ వైద్యుడికి ఉద్వాసన

సదరం సర్టిఫికెట్ జారీకి లంచం అడిగినందుకు చర్య

ప్రజాశక్తి - కడప అర్బన్

మానసిక వైకల్యంతో బాధపడుతున్న కుమార్తెకు సదరం సర్టిఫికెట్ జారీకి తండ్రి నుంచి లంచం డిమాండ్ చేసిన ఒక ప్రభుత్వ వైద్యుడిని తక్షణమే విధుల నుంచి తొలగించాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. 2022, ఏప్రిల్‌లో జరిగిన ఈ సంఘటనలో మానసిక సమస్యలతో బాధపడుతున్న ఒక బాలికకు సదరం సర్టిఫికెట్ జారీ చేయడానికి జిజిహెచ్‌లో పిల్లల మానసిక వైద్య నిపుణుడిగా పనిచేస్తున్న ఒక డాక్టరు ఆ బాలిక తండ్రి నుంచి రూ.10 వేలు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేని బాధితుడు చివరిగా రూ.7 వేలు ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు. అందుకు ఒప్పుకోకపోగా రెండు రోజుల్లో ఏర్పాటు చేయాలని ఆ వైద్యుడు గడువు పెట్టాడు. గతిలేని పరిస్థితుల్లో ఆ తండ్రి కలెక్టర్ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని పరిశీలించాలని అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)ను కోరగా, వారు విచారణ చేపట్టారు. సాక్షుల వాగ్మూలాలు, లభించిన పత్రాలాధారంగా లంచం ఆరోపణ వాస్తవమేనని 2025, ఏప్రిల్లో ఎసిబి తన నివేదికలో స్పష్టం చేసింది. సదరు వైద్యునిపనై తక్షణమే చర్యలు చేపట్టాలని సిఫారసు చేసింది. మానసిక సమస్యలతో సతమతమవుతున్న బాలిక దుస్థితిని గమనించకుండా తన స్వార్జన కోసం అడ్డదారులు తొక్కాలనుకున్న ఆ వైద్యుడి వైఖరిని తీవ్రంగా పరిగణించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ అతనికి తక్షణమే ఉద్వాసన పలకాలని ఆదేశాలు జారీ చేశారు.

చిన్నచౌకు పరిధిలో విస్తృతంగా తనిఖీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎస్‌పి ఆదేశాల మేరకు కడప డిఎస్‌పి ఎ.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చిన్నచౌకు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రయాణికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానితులను విచారించి ఆరా తీశారు. అంబేద్కర్ సర్కిల్, వై.జంక్షన్, అప్సర సర్కిల్ ప్రాంతాల్లో వాహనాలను, బస్సులను తనిఖీ చేశారు. బస్ స్టాండ్ ఆవరణలోని పార్శల్ కేంద్రంలో అణువణువూ తనిఖీ చేశారు. లాడ్జీలలో పోలీసులు ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, బస చేసిన వ్యక్తుల వివరాలపై ఆరా తీశారు. లాడ్జీలలోని రిజిస్టర్‌ను పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్వాహకులు అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీల్లో చిన్నచౌకు సిఐ ఓబులేసు, ఎస్‌ఐలు రాజరాజేశ్వర రెడ్డి, రవి కుమార్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చలేని ప్రభుత్వం

వైసిపి రాష్ట్ర పరిశీలకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

టిడిపి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చలేదని మాజీ మంత్రి, రాష్ట్ర పరిశీలకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. కడప నగరంలో గురువారం సాయంత్రం వైసిపి జిల్లా విస్తృతస్థాయి సమావేశం జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయంలో నిర్వహింవచారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు కనీస కనీస గిట్టుబాటు ధరను కల్పించలేదని, ఎరువులను అందించలేదని అన్నారు. నకిలీ మద్యాన్ని తయారుచేసి రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్యాన్ని బలిగొంటుందని అన్నారు. నకిలీ మద్యం తయారు చేసే దళారుల మధ్య తలెత్తిన వివాదాలవలనే ఈ నకిలీ మద్య స్కాం అనేది బయటకు వచ్చింది అన్నారు. త్వరలోనే అందరి పాపాలు పండుతాయని పేర్కొన్నారు. జగన్ పర్యటనలో పోలీసులు అడుగడుగున ప్రజలను అడ్డుకుంటున్నారు అన్నారు. కార్యక్రమంలో ఎంపీ అవినాష్‌రెడ్డి, సురేష్‌బాబు, అంజద్ బాషా, ఎమ్మెల్యే డాక్టర్ సుధా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, రామ సుబ్బారెడ్డి, రమేష్ యాదవ్, రఘురాం రెడ్డి, రాచమల్ల శివప్రసాద్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్ వే నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కడప : కడప కార్పొరేషన్ పరిధిలో ఉన్న మామిళ్ళపల్లి, ఎర్రముక్కపల్లి, అంగడివీధి రైల్వే లైన్ కింద నిర్వహిస్తున్న సబ్ వే (లో లెవెల్ రోడ్డు) నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కదిరి ప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు ఒకటిన్నర సంవత్సరం కిందట చేపట్టిన సబ్ వే నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. రైల్వేలైను అవతల నుండి నగరంలోకి రావాలంటే రెండు ఆటోలు మారాల్సి వస్తుందని పేర్కొన్నారు. దీని వల్ల విద్యార్థులు, కూలీలు, వృద్ధులు, మహిళలు ఎంతో కష్ట నష్టాలకు గురవుతున్నారని అన్నారు. నిర్మాణ పనులపై అధికారులు ,శాసనసభ్యులు వెంటనే స్పందించి ప్రజల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మల్లెం విజయభాస్కర్, ఆరిఫుల్లా సుబ్బారెడ్డి, గౌస్ మొహిదీన్, గంగా ధర్, సాంబశివుడు, మహమ్మదీ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు

సర్వసన్నద్ధం కావాలి

గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక కార్యచరణ

నేర సమీక్షలో ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్

త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ఇప్పటి నుంచే తగిన ప్రణాళికలు రూపొందించాలని ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా ట్రబుల్ మాంగర్లపై, ఎన్నికల నేరాలకు పాల్పడినవారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఈవ్ టీజింగ్, మహిళలు, చిన్నారులపై నేరాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఉక్కుపాదం మోపాలన్నారు. జిల్లాలో నేరాల నిరోధానికి అన్ని సబ్-డివిజన్‌లలో క్రైం పార్టీలను ఏర్పాటు చేయాలని డిఎస్‌పిలకు సూచించారు. రోడ్డు భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. మైనర్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసే వారిపై ఎం.వి యాక్ట్ మేరకు కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయాలని పేర్కొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా రోడ్లపై అడ్డంగా వాహనాలు నిలిపితే సీజ్ చేసి స్టేషన్‌కు తరలించాలని, జరిమానా విధించాలని తెలిపారు. సోషల్ మీడియాలో మహిళలపై, బాలికలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత గడువులోగా, చట్ట పరిధిలో పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని పేర్కొన్నారు. జిల్లాలోని విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు, ఆల యాలు, మసీదులు, చర్చిలలో ఏపి పబ్లిక్ సేఫ్టీ మెజర్స్ యాక్ట్ మేరకు సిసిటివి కెమెరాలు అమర్చు కునేలా తగిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత కమిటీ సభ్యులతో మాట్లాడి త్వరితగతిన అమర్చుకునేలా చూడాలన్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో బాణాసంచా దుకాణాలు, గోడౌన్‌లలో తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసినా, విక్రయించినా వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రొద్దుటూరు రూరల్ పరిధిలో మర్డర్ కేసును త్వరితగతిన ఛేదించిన డిఎస్‌పి పి.భావన ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు రూరల్ సిఐ ఎం. నాగ భూషణ్, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు.

విద్యార్థి విజయానికి పునాది

ప్రజాశక్తి- కడప అర్బన్ : మానసిక ఆరోగ్యం విద్యార్థి విజయానికి పునాది అని జిసిడిఒ రూత్ ఆరోగ్య మేరీ అన్నారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 11వ బెటాలియన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సమీర్ బాష అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం శారీరిక ఆరోగ్యానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో మానసిక ఆరోగ్యానికి కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచనలు పెంపొందించడం మనందరి బాధ్యతని తెలిపారు. డిస్ట్రిక్ట్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ లక్ష్మీ నరసింహ రాజు మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడులకు గురి కాకుండా ఉత్సాహంగా, సంతోషంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించే విధంగా ఉపాధ్యాయులు చర్య తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అధికారులు కలిసి మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, సురేష్ ఉపాధ్యాయులు సిరాజుల్ల ,రవిశంకర్, మహబూబ్ బాషా, చంద్రశేఖర్, సుమతి, ఒకేషనల్ టీచర్స్ మౌలాలి, హేమంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు మానసిక ఆరోగ్యం

ప్రజాశక్తి - వల్లూరు : విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు మానసిక ఆరోగ్యం ప్రధానమైందని మెంటల్ అండ్ హెల్త్ కౌన్సిలర్ డాక్టర్ శిల్ప, డాక్టర్ నాగభూషణం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష రాష్ట్ర గర్ల్స్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి , జిల్లా జిసిడి రూతు, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఛాయేంద్ర ఆదేశాల మేరకు వరల్డ్ మెంటల్ హెల్త్ వారోత్సవాలు భాగంగా విద్యార్థులకు ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు సంపూర్ణ గా అభివృద్ధి చెందాలంటే మానసిక ఆరోగ్యం చాలా అవసరం అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎల్‌విపిఇఐలో వృద్ధుల కోసం ప్రత్యేక నేత్ర సంరక్షణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్యశాలలో అత్యాధునిక నేత్ర వైద్య సేవలు అందిస్తున్నట్టు వృద్ధుల నేత్ర సంరక్షణ విభాగాధిపతి డాక్టర్ అవినాష్ పతేంగే తెలిపారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సం పురస్కరించుకుని ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్యశాల ప్రాంగణంలో ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ అవగాహన కార్యక్రమాల ముగింపు సదస్సు గురువారం నిర్వహించారు. ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్యశాలలో ఎల్డర్లీ ఐ కేర్ సెంటర్స్ (ప్రత్యేక వృద్ధుల నేత్ర సంరక్షా కేంద్రాలు) అందుబాటులో ఉన్నాయన్నారు. ఇవి వృద్ధాప్యంలో వచ్చే నేత్ర సమస్యల పట్ల అవగాహన కల్పించి చికిత్సలు అందిస్తాయన్నారు. వృద్ధుల స్నానం కోసం షవర్ కుర్చీలు, హ్యాండ్ షవర్లు ఏర్పాటు, మెట్లు దిగటానికి రెండు వైపుల రెయిలింగ్ ఏర్పాటు చేయామని చెప్పారు.

ఘనంగా 'వైట్ కోట్స్'

ప్రజాశక్తి-కడప సిటీ : ప్రభుత్వ వైద్య కళాశాల, కడపలో మేజర్ ఈవెంట్‌గా మెడికల్ విద్యార్థుల కోసం 'వైట్ కోట్స్ సెరమని' గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ టి.జమున, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ విద్యార్థులకు వైట్ కోట్ వేడుకను విశిష్టంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వైద్య వృత్తి పట్ల తాము కలిగిన నిబద్ధతను వెల్లడిస్తూ, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఈ విద్యను ఎంచుకున్నట్టు తెలిపారు. భవిష్యత్తులో సమాజానికి మేలు చేయాలన్న లక్ష్యంతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో ఇది ఒక ముఖ్యమైన మలుపుగా నిలుస్తుందని చెప్పారు. వైద్యవృత్తిలో వారి ప్రయాణానికి ఇది బలమైన ప్రారంభమవుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆచార్యులు, కళాశాల సిబ్బంది కూడా పాల్గొన్నారు.

దొంగ ఓట్లపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓటరు జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓటు చోర్.. గద్దె చోడ్' దేశ వ్యాప్త ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరాన్ని ప్రజలు గుర్తించాలని డిసిసి అధ్యక్షులు పిలుపునిచ్చారు. గురువారం నగరం 36వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ గౌస్‌పీర్, దాసరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై ఓట్ చోర్.. గద్ది చోడ్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత విజయజ్యోతి కార్యక్రమ నిర్వహణ గురించి ప్రజలకు వివరించి ఎన్నికల సంఘానికి సమర్పించేందుకు వారిచేత సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ ఉద్యమానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. తమ ఓటుహక్కు కాపాడుకోవాలని కాంగ్రెస్‌పార్టీ చేస్తున్న పోరాటాన్ని ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నారన్నారు. గౌస్‌పీర్ మాట్లాడుతూ తమ ఉద్యమానికి తోడ్పాటు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో 36వ డివిజన్ నాయకులు దాసరి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, శామీర్ హుస్సేన్, సిద్దిక్, ముబారక్, యూసుఫ్, కటిక జిలాన్ బాష, నాసిర్ ఖాన్, రఫీక్ ఖాన్, సర్దారి, అబ్దుల్ రౌఫ్, పలువురు కాంగ్రెస్ పార్టీ స్థానిక ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే

నిరవధిక సమ్మె

- విద్యుత్ స్ట్రగుల్ కమిటీ వెల్లడి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల



మాట్లాడుతున్న కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

విద్యుత్ రం గంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమ స్యలను వెంటనే పరిష్క రించాలని, లేకపోతే ఈనెల 15 నుంచి నిర వధిక సమ్మెకు దిగుతామని ఎపి విద్యుత్ ట్రేడ్ యూ నియన్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సుబ్బిరెడ్డి విద్యుత్ యాజమాన్యాలకు హెచ్చరించారు. ఆర్‌టిపిపిలో స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ గురించి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ కార్యాలయాల జనరేటింగ్ స్టేషన్‌లో అక్టోబర్ 14న వర్క్ టు రూల్ పాటిస్తామని చెప్పారు. విద్యుత్ సంస్థలలో సుమారు 27 వేల మంది కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని వారందరిని ఉద్యోగాలలో పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయాల్లో కార్మికులకు హామీ ఇవ్వడం అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోకపోవడం చేస్తున్నారని విమర్శించారు. కార్మికులకు పిఆర్‌సి బకాయిలు ఇవ్వలేదన్నారు. విద్యుత్ ఉద్యోగులకు 4 డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. గతంలో లాగా పెన్షన్ సౌకర్యం ఉద్యోగులకు కార్మికులకు కల్పించాలన్నారు. వారికి, వారి కుటుంబ సభ్యులకు వైద్యం చేయించుకునేందుకు నగదు రహిత మెడికల్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఇటువంటి న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే ఉద్యమంలోకి వెళ్లక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వి గంగయ్య, పుల్లారెడ్డి, రాజు, శివ, ప్రసాద్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న నాయకులు

నిరంకుశత్వంపై నిరసన

ప్రజాశక్తి-కడప అర్బన్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని వైసిపి మాజీ మంత్రి నారాయణ స్వామి ముఖ్య అనుచరుడు చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మం డలం దేవలంపేట వైసిపి సర్పంచ్ గోవిందయ్య, కార్యకర్తలు ధ్వంసం చేసి దారుణమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. గురువారం కడప అంబేద్కర్ సర్కిల్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నగరక అధ్యక్షులు మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దళిత వర్గాలలో ఉద్రిక్తకు దారి తీసి వారి ఆగ్రహానికి గురిచేసింది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను ప్రత్యక్షంగా అవమానించడమే కాకుండా షెడ్యూల్ కులాల వారి ఆత్మ గౌరవం పై దాడి చేయడమేనని పేర్కొన్నారు. దళతులను అవమానించడం జాతికే అవ మానం అని జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆర్‌టిఐ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ బోనం శిలాస్ ఆవేదన వ్యక్తం చేశారు కార్యక్రమంలో ఎపి వేర్ హౌస్ డైరెక్టర్ మురికి నాటి శ్రీధర్, ఏపీ వడ్డెర డైరెక్టర్ గండికోట వెంకటసుబ్బయ్య, రిమ్స్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు వల్లి, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్కర సుబ్బారెడ్డి, నగర ఉపాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది పసుపులేటి గౌతం కుమార్, 10వ డివిజన్ మాజీ కార్పొరేటర్ అందూరి రాజ గోపాల్ రెడ్డి, 7వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గోంటు ముక్కల చిన్నబాబు, నగర కార్యదర్శులు కోనేటి వెంకటేశు, బొడ్డూరి నరేష్ రాజు, బాబా పకృద్దీన్ డివిజన్ ఇన్‌ఛార్జులు, ఎస్‌సి మహిళా నాయకులు ధార రాణి, ఎవ్రీథింగ్ పార్టీ మైనారిటీ నాయకులు జిలాని బాషా, ఎస్సీ నాయకులు చవలముడి శంకర్, జలతోటి జయకుమార్, రంజిత్, అబ్రహం, కొమ్మలపాటి సుబ్బారాయుడు పాల్గొన్నారు.

రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలి : డిసిసి

ప్రజాశక్తి - కడప : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయి పై దాడి చేసిన మతోన్మాది న్యాయవాది రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి డిమాండ్ చేశారు. గురువారం కడప ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ యువ జన విభాగం పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయకుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ జ్యోతి పాల్గొని మాట్లాడుతూ సుప్రీంకోర్టు జడ్జి పైన న్యాయ వాది బూటు విసిరి దాడి చేయడం దేశానికే సిగ్గుచేటు అని ఆమె పేర్కొన్నారు.అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు జడ్జి గవాయిపై జరిగిన దాడిని సుమోటో కేసుగా స్వీకరించి ప్రభుత్వం న్యాయవాది రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ర్యాలీలో వైద్య సిబ్బంది, ఎంపిటిసి చంద్రశేఖర్‌రెడ్డి

తగ్గనున్న వైద్య పరికరాల ధరలు

ప్రజాశక్తి - ఖాజీపేట

జిఎస్‌టి సంస్కరణల వల్ల వైద్య పరికరాలు, ఔషధాలపై పన్నుల భారం తగ్గింపు అవకాశం ఉందని ఎంపిటిసి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల ప్రవీణ్ ఆధ్వర్యంలో సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేముల : వేముల పిహెచ్‌సి డాక్టర్ మేఘన ఆధ్వర్యంలో గురువారం సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ భారత ప్రభుత్వం జీఎస్‌టీ 2.0 సంస్కరణలు తీసుకొచ్చిందని, మందుల ధరలు తగ్గించడం, ఆరోగ్య సేవలు చౌకగా చేయడం వంటి లాభాలున్నాయన్నారు. కార్యక్రమంలో పేర్ల శేషారెడ్డి, సిహెచ్‌ఓ అరుణకుమారి, డిప్యూటీ ఈఓ ఉషారాణి, సూపర్వైజర్ విజయలక్ష్మి, రమేష్, వీణ, పిహెచ్‌సి ఆరోగ్య సిబ్బంది, వేముల హైస్కూల్ హెచ్‌ఎం నాగిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పులివెందులలో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజా మొయిద్దీన్, డిప్యూటీ హెచ్ఈఓ ఆర్.ప్రసన్నల గురువారం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. పులివెందుల పరిధిలోని యుపిహెచ్‌సి నగరిగుట్ట, హాస్పిటల్ తులసమ్మ, బాలాజీ నర్సింగ్ ఆసుపత్రి, రాజా రాఘవేంద్ర, మారుతీ హాస్పిటల్, శ్రీసిరి హాస్పిటల్, నీరజ హాస్పిటల్‌లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ స్నేహ ప్రత్యూష, డాక్టర్ వసుంధర, డాక్టర్ మనిస్విని, డాక్టర్ శిరీష, డాక్టర్ నీరజ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

సర్పంచ్ గోవిందయ్యపై చర్యలు తీసుకోవాలని, తక్షణమే అరెస్ట్ చేయాలని టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బిర్రు గుర్రప్ప అలియాస్ సంతోష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన టిడిపి కార్యాలయంలో మాట్లాడుతూ దళితులను అవమానించే రీతిగా వైసీపీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారన్నారు. గత ప్రభుత్వంలో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గదళితుల పట్ల చిన్న చూపు చూసి ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారన్నారు. ఎస్సీలకు రావలసిన రుణాలు, రాయితీలు ఆపి దళిత కుటుంబాలను చిన్నాభిన్నం చేశారని ఆరోపించారు. ఇకనైనా వైసీపీ నాయకులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు.

వికాస్ విహార్‌లో సేవా కార్యక్రమం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



పిల్లలతో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మండలంలోని గోపవరం పంచాయితీలోని శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం రాస్ విహార్ రిహాబి లిటేషన్ అండ్ కేర్ సెంటర్ (మానసిక వికలాంగ పిల్లల సంరక్షణ కేంద్రం)లో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పిల్లలతో సరదా ఆటలు నిర్వహించి, రాయడానికి అవసరమైన కిట్లు, స్టేషనరీ పంపిణీ చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి. ఇందిర వాలంటీర్లతో కలిసి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి పిల్లలకు ఆత్మవిశ్వాసం, ఆనందం కలిగించారు. కార్యక్రమ అనంతరం మధ్యాహ్న భోజనం (మిడ్ డే మీల్) ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వండి, పిల్లలకు వడ్డించారు.

వికలాంగ విద్యార్థులకు టి షర్టులు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక భవిత కేంద్రంలో విద్యాభ్యాసం చేస్తున్న వికలాంగ విద్యార్థులకు టి షర్టులు పంపిణీ చేశారు. గురువారం వేంపల్లెకు చెందిన ఎన్ఆర్ఐకు చెందిన టి.సుభాష్ తన పుట్టినరోజు వేడుకలను భవిత కేంద్రంలో నిర్వహించారు. ఎంఇఓ-2 స్టాలిన్ ఐజాక్ కేక్ కట్ చేసి వికలాంగ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎన్ఆర్ఐకు చెందిన దాత సుభాష్ అందజేసిన టి షర్టులను పంపిణీ చేశారు.



టి షర్టులు పంపిణీ చేస్తున్న ఎఇఓ స్టాలిన్

తనతోటి చిన్ననాటి స్నేహితులతో కలిసి భవిత కేంద్రంలో పుట్టినరోజు వేడుకలు చేపట్టడం సంతోషంగా ఉందని సుభాష్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ స్నేహితులు గాలి హరి, సలీం, వినోద్‌కుమార్, ఓబులేసు, ఈశ్వరరెడ్డి, స్వాతి, ఐఇఆర్టీలు యశోద, సుజాత, ఆయా సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీలకు మహమ్మద్ ఆజాద్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



అండర్-19 రాష్ట్రస్థాయి కడప జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు పులివెందుల శ్రీసాయి చేతన్య జూనియర్ కాలేజీ విద్యార్థి ఎస్.మహమ్మద్ అజాద్ ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ ఎ.నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ఆజాద్ రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలన్నారు. ప్రిన్సిపల్ పి.శశిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి.రామ లింగారెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

మహారాజశ్రీ గుత్తి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

H.M.O.P.No: 205/2024

Between:

మునగనూరు సాంబశివా రెడ్డి ...వాది

మరియు

కేతు సుప్రజ ...ప్రతివాది

TO,

కేతు సుప్రజ, తండ్రి కేతు పవన్ కుమార్ రెడ్డి,
భర్త మునగనూరు సాంభశివా రెడ్డి,
R/o రంగసాయపురం గ్రామం,
ఎర్రగుంట్ల మండలం,
కడప జిల్లా,

ప్రతి వాదికి నోటీసులు

వాది అయిన మీ భర్త మీ పైన మీనుండి విడాకులు కోరుతూ పై దావాను మీ మీద దాఖలు చేసియున్నారు. పై దావా మీ హాజరు నిమిత్తము వాయిదా 7-11-2025వ తేదిన వేయబడినది. కావున మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై తేదిన ఉదయం 10-30 గంటలకు పై కోర్టు నందు స్వతహాగా కాని, వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమునందు తీర్మానము చేయబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది :07-11-2025

N.U.DEVANATHA REDDY,
వాది తరుపు వకీలు, తాడిపత్రి
Cell No. 8919016750

గుడిపాడులో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలి



ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న జి.శివకుమార్

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

దువ్వూరు మండలం గుడిపాడు గ్రామంలో 67 సర్వే నెంబర్‌లో ఉన్న ఆర్అండ్‌బి స్థలం ఆక్రమణ విషయంలో తలెత్తిన గొడవ, దాడుల పట్ల సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివకుమార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా, పరస్పర దాడులు జరగకుండా తక్షణమే పోలీస్ పికెటింగ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు. బుధవారం ఉదయం ఆర్అండ్‌బి స్థలం విషయంలో జరిగిన ఘర్షణలో గాయపడి చికిత్స పొందుతున్న వారిని గురువా రం సీపీఎం బృందం సంఘటనా స్థలాన్ని సందర్శించి, గ్రామస్తుల నుండి వివరాలు సేకరించింది. అనంతరం వారు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న మల్లెల వెంకట సుబ్బయ్య, మల్లెల చిన్నకొండయ్య, రామసిద్ధయ్య, చంద్ర నారాయణమ్మను పరామ ర్శించారు.

ప్రభుత్వ ఉద్యోగిపై చర్యలు చేపట్టాలని డిమాండ్

ప్రభుత్వ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని దువ్వూరు తహశీల్దార్, ఎఎస్ఐకి జి.శివకుమార్ వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిపాడు 67 సర్వే నెంబర్ ఆర్అండ్‌బి స్థలమని, దీనికి ఆనుకొని ఉన్న 56 సర్వే నెంబర్‌లో సుమారు 80ఏళ్లుగా నాయి బ్రాహ్మణులు నివసిస్తున్నారని తెలిపారు. గతంలో నిర్మాణాలకు ప్రయత్నించగా, ఆర్అండ్‌బి అధికారులు కొలతలు వేసి అడ్డుకోవడంతో నాటి నుండి ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని వివరించారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన బద్వేలులో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తి, దువ్వూరు మండలంలోని హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న వ్యక్తి, మరో వ్యక్తి కలిసి దాదాపు 20 ఏళ్లుగా ఆర్అండ్‌బి స్థలాన్ని ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. స్థానికులు మల్లెల వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులు ఈ ఆక్రమణ ప్రయత్నాలను అడ్డుకుంటూ వస్తున్నారని తెలిపారు. మైదుకూరు సీఐ సూచన మేరకు సర్వే ద్వారా కొలతలు వేయించుకోవాల్సి ఉండగా, ఆక్రమణదారులు చలానా కట్టకుండానే కొలతలు వేయడానికి ప్రయత్నించారని సీపీఎం నేతలు తెలిపారు. దీన్ని అడ్డుకున్నందుకే కక్షతో ప్రధాన రాజకీయ పార్టీ మద్దతుతో బుధవారం ఉదయం ప్రభుత్వ ఉద్యోగి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి, మరో 20 మంది వ్యక్తులు మల్లెల వెంకటసుబ్బయ్య, పెద్ద కొండయ్య, చిన్న కొండయ్య, రామసిద్ధయ్యతో పాటు మరో ఇద్దరిపై దాడి చేశారని ఆరోపించారు. దాడిలో ఒక వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించాలని ప్రొద్దుటూరు వైద్యాధికారులు సూచించారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు, మైదుకూరు మండల నాయకులు జహంగీర్ బాషా, గురయ్య పాల్గొన్నారు.



దువ్వూరు తహశీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న జి.శివకుమార్

ప్రయివేటీకరణ చేస్తే కూటమి ప్రభుత్వం పతనమే

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేస్తే టిడిపి కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి భవనాలు వంద శాతం, నర్సింగ్ కళాశాల భవనాలు వంద శాతం, వైద్య కళాశాల భవనాలు 60 శాతం, మిగతా క్వార్టర్స్, మౌలిక సదుపాయాలకు సంబంధించి 60 శాతం పూర్తయ్యాయని తెలిపారు. వైద్య కళాశాల రూ.500 కోట్ల అంచనా కాగా టిడిపి కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చేనాటికే రూ.400కోట్లు ఖర్చు చేశారన్నారు. ఈ 16 నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.వంద కోట్ల అదనంగా ఖర్చు చేసి ఉంటే ఈపాటికి సర్వాంగ సుందరంగా పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల తయారై ఉండేదన్నారు. ఆర్థికసాయం చేసేందుకు నాబార్డు కూడా ఓకే చెప్పిందని తెలిపారు. నర్సింగ్ కళాశాల భవనాలలో వైద్య విద్యార్థులకు తరగతుల నిర్వహించవచ్చు అన్నారు. భవనాలు వంద శాతం పూర్తయిందనే జాతీయ వైద్య కమిషన్ సభ్యులు పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి 50 ఎంబిబిఎస్ సీట్లను 2024 ఆగస్టు 16న కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్వహించేందుకు ఏమాత్రం ఇబ్బంది లేదనేది దీన్ని బట్టి తెలుస్తోందన్నారు. ఆ 50 సీట్లు వద్దని కూటమి ప్రభుత్వం జాతీయ వైద్య కమిషన్‌కు 2024 సెప్టెంబర్ 10న లేఖ రాయడం బాధాకరమన్నారు. అదనంగా సీట్లు అడగాల్సింది పోయి మంజూరు చేసిన సీట్లును వద్దనడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎన్టీ రామారావు ఆశయాలకు పూర్తి విరుద్ధమన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం జారీ చేసిన జిఒ590ను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ రంగంలోనే వైద్య కళాశాలలు నడవాలని డిమాండ్ చేశారు.

'ఉపాధి'లో అక్రమాలను అరికట్టేందుకు ప్రణాళిక



ఉపాధి కూలీలకు ఇకెవైసి చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - చాపాడు

ఉపాధి హామీ చట్టంలో ప్రభుత్వం పలుమార్పులు చేసేందుకు చర్యలు చేపట్టింది. క్షేత్రస్థాయి సిబ్బందికి అనుకూలంగా ఉన్నవారు పనికి రాకపోయినా హాజరు నమోదు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపించేవి. పనికి రాని వారి పేర్లు మస్టర్‌లో నమోదు చేయడం వల్ల నిజంగా వెళ్లే కూలీలకు అన్యాయం జరిగేది. సగటు వేతనం దక్కడంలేదు. ఈ అవకతవకలపై నిత్యం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందేవి. సామాజిక తనిఖీల్లో బయటపడేవి. అవకతవకలను నివారించి చట్టాన్ని పటిష్టపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఉపాధి కూలీల కుటుంబ సభ్యులతో ఆధార్ ధ్రువీకరణ చేపడుతున్నారు. ఉపాధి కూలీల కంటి(ఐరీస్) నమూనాలను, ఆధార కార్డులను సేకరించి ఇకెవైసి చేస్తున్నారు. జాతీయ ఉపాధి మస్టర్ పర్యవేక్షణ వ్యవస్థ యాప్‌లో ఇకెవైసి నమోదు చేస్తున్నారు. కూలీల జాబ్ కార్డును ఎంపిక చేసుకొని ఆధార్ సంఖ్యను అనుసంధానం చేస్తున్నారు. నమోదు ప్రక్రియ తర్వాత ఉపాధి కూలీలు ఒకరి బదులు మరొకరు పనికి వచ్చేందుకు ఏమాత్రం వీలుండదు. మరణించిన వారి స్థానంలో పనికి వచ్చే అవకాశం ఉండదు. ఎంతమంది పనికి వస్తే అంత మంది మాత్రమే మస్టర్లు రాసే అవకాశం ఉంటుంది. జిల్లాలో 2,30,912 జాబు కార్డులు ఉండగా, ఇందులో 4,20,491 మంది సభ్యులు ఉన్నారు. 1,35,000 కుటుంబాలు ఉపాధి హామీని సద్వినియోగం చేసుకుంటున్నాయి. ఇకెవైసి 50 శాతం పూర్తయింది. గ్రామాల్లో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలు పూర్తిగా ఇకెవైసి పనుల్లో నిమగ్నమయ్యారు.

సిజెఐ గవాయిపై దాడి దుర్మార్గం : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రామకృష్ణ గవాయిపై అడ్వకేట్ కిషోర్ దాడి చేయడాన్ని సిపిఎం తరపున తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి గోపాల్‌దాస్ ఏసుదాస్ పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. భారత రాజ్యాంగంలో అత్యున్నతమైన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులను మరింత ప్రోత్సహించేలా ఉందన్నారు. న్యాయమూర్తికే ఇంత అవమానం జరిగితే కనీసం ఏ ఒక్క ఎంపీ, ఎమ్మెల్యేగానీ, ప్రతిపక్ష నాయకులు గానీ, అధికార పక్ష నాయకులు గానీ స్పందించకపోవడం ఆర్ఎస్ఎస్ మతోన్మాదానికి ప్రోత్సహించడం అవుతుందన్నారు. మతోన్మాదుల దాడు లను ప్రజలు తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఏ వినయ్‌కుమార్, దాసరి విజయ్, రవిరావు, సిఐటియు నాయకులు నరేంద్ర, ప్రసాద్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాసులు, ఆటో యూనియన్ నాయకులు, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు హరిబాబు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

13 నుంచి ఉచిత కోచింగ్ : జెవివి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగాల కోసం ఈనెల 13 నుంచి ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా యూత్ కన్వీనర్ హేమంత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం స్థానిక జెవివి కార్యాలయంలో గోడపత్రాలను ఆవిష్కరించారు. ఉచిత కోచింగ్ జెవివి కార్యాలయంలో నాలుగు నెలల పాటు ఉంటుందన్నారు. నిపుణులైన అధ్యాపకులతో శిక్షణనిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువత ఈ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అభ్యర్థులు 97053 33305 ఫోన్ చేసి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెవివి నాయకులు రాకేష్, జయసింహ, కోచింగ్ విద్యార్థులు హరీష్, మహేష్ పాల్గొన్నారు.

ఓట్ల అవకతవకలపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఖాజీపేట

దేశ వ్యాప్త ఓటర్ల అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం ఖాజీపేటలో చేపట్టారు. మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి చాపాటి రామ సుధాకర్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఫయాజ్ ఆధ్వర్యంలో ఓటు చోర్.. గద్దె చోడ్ నినాద కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ నిర్వహించారు. ప్రజలను కలుస్తూ ఓట్ల అవకతవకల గురించి వివరించారు.

దృష్టి లోపంలేని సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దృష్టి లోపంలేని సమాజాన్ని నిర్మిద్దామని మహిళా డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా గురువారం స్నేహిత అమృత సేవాసమితి ఆధ్వర్యంలో మహిళ డిగ్రీ కళాశాలలో 'కళ్లను ప్రేమించండి' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నేత్రదానం ఎంతో పుణ్యకార్యమన్నారు. నేత్ర దానానికి ప్రతి కుటుంబం అవగాహనా కలిగి ఉండి, ప్రోత్సహించాలన్నారు. డాక్టర్ స్నేహ ప్రత్యూష మాట్లాడుతూ సృష్టిలోని అందాలను చూడాలంటే చూపు ముఖ్యమన్నారు. ఆ దృష్టిని కాపాడుకోవడానికి కళ్లను ప్రేమించాలని సూచించారు. ఆకుకూరలు, గుడ్డు, చేపలు వంటి పౌష్టి కాహారం తీసు కోవా లన్నారు. నేత్రదానం ఇద్దరు అంధులకు చూపు నిస్తుందన్నారు. నేత్ర దానానికి 99665 09364కు సమాచారం ఇవ్వా లన్నారు. స్నేహిత అమృత సేవా సమితి అధ్యక్షుడు రాజు, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ అధికారులు శ్రీనిత, శ్రీనివాసులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రొద్దుటూరు

I.A.No. 98/2022
O.S.No. 98/2022

వి.సుచరిత, W/o సాయిరాం, వయస్సు 44 సం॥లు, వ్యాపారం, డోర్‌నెం.3/966, వైఎమ్ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు. ...పిటిషనర్

Vs

1. కుత్తూరు చిన్న వెంకటసుబ్బయ్య, చనిపోయినందున వారసు లు 1 to 3.
2. కుత్తూరు సుమంత్, S/o కె.సి.వి.సుబ్బయ్య, 8/559, గిడ్డంగివీధి, ప్రొద్దుటూరు.

...రెస్పాండెంట్లు

రెస్పాండెంటు నెం.2 నోటీసు

పిటిషనరు రెస్పాండెంట్లు మీద కె.సి.వి.సుబ్బయ్య ఆస్తులకు సంబంధించి జప్తు కోరుచు పిటిషను దాఖలు చేసి వున్నారు. అట్టి పిటిషను మరియు 2వ రెస్పాండెంటు హాజరు నిమిత్తం 14.10.2025 పై కోర్టు నందు వాయిదా వున్నది. 2వ రెస్పాండెంటు అయిన కె.సుమంత్ పై తేది నందు ఉ॥10.30గం॥లకు ప్రత్యక్షము కాని పరోక్షముగా కాని హాజరు కావలెను.లేనంతట పరోక్షముగా తీర్మాణం చేయబడును.

//By Order of the Court//

ఎమ్. శరత్ చంద్రా రెడ్డి
అడ్వకేట్, ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రొద్దుటూరు

O.S.No. 98/2022

వి.సుచరిత, W/o సాయిరాం, వయస్సు 44 సం॥లు, వ్యాపారం, డోర్‌నెం.3/966, వైఎమ్ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు. ...వాది

Vs

1. కుత్తూరు చిన్న వెంకటసుబ్బయ్య, చనిపోయినందున వారసు లు 1 to 3.
2. కుత్తూరు సుమంత్, S/o కె.సి.వి.సుబ్బయ్య, 8/559, గిడ్డంగివీధి, ప్రొద్దుటూరు.

...ప్రతివాదులు

ప్రతివాది నెం.2 నోటీసు

వాది ప్రోనోటు బాకి నిమిత్తం కె.సి.వి.సుబ్బయ్య వారసుల మీద దావా దాఖలు చేసివున్నారు. అట్టి దావా నందు 2వ ప్రతివాది అయిన కె.సుమంత్ హాజరు నిమిత్తం 14.10.2025వ తేదీన వాయిదా వున్నది. పై పేర్కొన్న 2వ ప్రతివాది 14.10.2025 ఉ॥10.30 గం॥లకు ప్రత్యక్షముగా కాని పరోక్షముగా కాని హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానం చేయబడును.

//By Order of the Court//

ఎమ్. శరత్ చంద్రా రెడ్డి
అడ్వకేట్, ప్రొద్దుటూరు.

ఐసిఐసిఐ బ్యాంక్ డీడీలు పోయినవి

మలికిరెడ్డి వెంకట తులసి రెడ్డి అనే నేను పెద్దముడియం మండలం పాపాయి పల్లె నివాసిని. నాకు చెందిన 52877, 50 28 80 నెంబర్ గల ఐసిఐసిఐ బ్యాంకు రెండు డీడీలు 23/9/2025 నాడు మా గ్రామం పాపాయి పల్లె నుండి జమ్మలమడుగుకి బస్సులో ప్రయాణిస్తుండగా తెల్ల కవర్లో ఉంచుకున్న డిడిలను పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికిన యెడల పెద్దముడియం పోలీసు వారికి అందజేయగలరు.



చే గువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

చే గువేరా స్ఫూర్తితో పోరాడుతాం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎగిసే విప్లవ కెరటం చేగువేరా అని యువత ఆయనని ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన స్ఫూర్తితో విభజన హామీల అమలు కోసం, కడప ఉక్కు కోసం యువత చే స్ఫూర్తితో పోరాటాలలో భాగస్వామ్యం అవ్వాలని డిఐఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పిలుపునిచ్చారు. చే గువేరా వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నాడు అమెరికా సామ్రాజ్యవాదానికి ఎదురొడ్డి, క్యూబా పోరాటంలో కీలకపాత్ర పోషించిన వీరుడు చే గువేరా అన్నారు. డాక్టర్ వృత్తిలో పేదల కోసం అహర్నిశలు కష్టపడి గెరిల్లా పోరాట ఉద్యమాలు నిర్వహించి సామ్రాజ్యవాదుల చేతిలో వీర మరణం పొందాడన్నారు. కార్యక్రమంలో డిఐఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా నాయకులు సునీల్, ప్రొద్దుటూరు నాయకులు రమేష్, బన్నీ, జగన్ పాల్గొన్నారు. **స్థానిక గీత ఆశ్రమంలోని..** శారదా జూనియర్ కళాశాలలో గురువారం చే గువేరా వర్ధంతి సందర్భంగా ఎఐఎడబ్ల్యుయు నాయకులు గుర్రం డేవిడ్‌రాజ్ విద్యార్థులతో కలిసి ఆయనకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్యన్, ఓబులేసు, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : ఎగిసే విప్లవ కెరటం చే గువేరా అని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోని విభజన హామీల అమలు కోసం పోరాడుతామని డివైఎఫ్ఐ జమ్మలమడుగు పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య తెలిపారు. చే గువేరా వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ఐటిఐ కాలేజీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మతోన్మాదం పేరుతో నేడు దేశంలో అణగారిన వర్గాలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచారాలు ఎక్కువయ్యాయన్నారు. వీటిని అరికట్టడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాఘవేంద్ర, రమేష్, చంద్రశేఖర్, ఓబులేష్ పాల్గొన్నారు.

కడప అర్బన్ : ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో చేగువేరా 57వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. నగరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న , నాయకులు వసుంధర, భార్గవి, హర్షిణి, అర్చన, రాణి, సాయి శ్రీనివాస్, ఖాదర్ వలి, తరుణ్, శ్రీనివాస్ రెడ్డి, రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి

చీనీలో వేరుకుళ్లు, బంక తెగులు నివారించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

చీనీ తోటల్లో వేరుకుళ్లు, బంక తెగులు నివారిస్తేనే మంచి ఫలితాలు వస్తాయని ముద్దనూరు ఉద్యానవన శాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలో అంకాలమ్మ గూడూరు, బలపనూరు, కోవరం గుట్టపల్లి రైతులక్కు చీనీ తోటల్లో వర్షాకాలంలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కొన్ని ప్రాంతాల్లో నీరు అధికంగా ఉండడం, తేమ ఆరక పోవడంతో చెట్లు వేర్లు త్వరగా కుళ్లి పోతాయన్నారు. చీనీ చెట్లు దెబ్బ తినకుండా ఉండా లంటే రోజుకు 60 లీటర్ల మించి నీరు అందించకూడదన్నారు. తెగుళ్ల నివార ణకు ఆయన పలు సూచనలు చేశారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అండర్-19 బేస్‌బాల్‌కు ఎంపికైన భరత్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



అండర్-19 రాష్ట్రస్థాయి కడప జిల్లా బేస్ బాల్ జట్టుకు ఎంపిక పులివెందుల శ్రీసాయి చేతన్య జూనియర్ కాలేజీ విద్యార్థి వి.భరత్ ఎంపికవడం పట్ల కళాశాల కరస్పాన్మెంట్ ఎ.నారా యణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆ మేరకు గురు వారం కళాశాలలో భరత్‌ను అభినందించారు. కార్యక్ర మంలో ప్రిన్సిపల్ శశిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రామలింగారెడ్డి ఉన్నారు.

క్రైం కార్నర్

బాకీ విషయమై తుమ్మలపల్లిలో ఘర్షణ

రెండు గ్రూపుల వారికి తీవ్ర గాయాలు, ప్రభుత్వాసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

మండల పరిధిలోని ఆర్.తుమ్మలపల్లె గ్రామంలో గురువారం డబ్బు బాకీ విషయమై నాగయ్య, రామాంజనేయరెడ్డి వర్గాలు కత్తులతో దాడి చేసుకున్నాయి. ఈ సంఘటనలో ఇరువర్గాలకు చెందిన నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. తుమ్మలపల్లె గ్రామానికి చెందిన నాగయ్య అనే వ్యక్తి రామాంజనేయు రెడ్డి దగ్గర రూ.90 లక్షలు డబ్బులు తీసుకున్నాడు. ఆ సమయంలో ఈ డబ్బులు మూడేళ్లలోపు చెల్లించాలని, ప్రతి ఏడాది వడ్డీ డబ్బులు కట్టాలని వీలునామా రాయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాదిలో రూ.ఆరు లక్షలు వడ్డీ డబ్బులు కట్టలేదనే నేపథ్యంలో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో నాగయ్య, ఆయన కుమారుడు అనిల్‌కుమార్‌కు.. రామాంజనేయులు రెడ్డి వర్గానికి చెందిన గంగాధర్‌రెడ్డి, మల్లారెడ్డికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ఘర్షణకుగల కారణాలను అడిగి తెలుసు కున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



తీవ్రంగా గాయపడ్డ నాగయ్య